నలుగురైదుగురు కొట్టారు. వాళ్ళు నాకు బజార్లో కనబడకపోవడం వాళ్ళకీ నాకూ మంచిది" అని చెప్పి నరసయ్య వెళ్ళిపోయాడు.

ఒక గంట పోయేసరికి కోమటి రంగయ్య, నరసయ్య యింటికి వచ్చి, అతని భార్యతో ఆమెకు కావలసిన సామాను, కొట్టుకు వచ్చి తీసుకుపొమ్మని చెప్పాడు. మధ్యాహ్నం భోజనాల వేళకి, కోమటి రంగయ్య భార్య పెరుగు తీసుకు వచ్చి నరసయ్య భార్యకు యిచ్చి వెళ్ళింది.

మర్నాడు ఉదయానికి, నరసయ్య చొప్పదొడ్లో, రెండు వాముల చొప్ప మేటికి పడివుంది.

నరసయ్య సత్యాగ్రహపు రోజులలో అతని దవడలు వాయగొట్టినవాళ్లు, నెల తిరక్కుండానే ఒక్కొక్కడు అధమం వారంరోజులైనా మంచమెక్కారు.

---

# 15. ఆ సమయం

ఆరు నెలల అబ్బాయిని తీసుకుని, పుట్టింటి నుంచి అత్తింటికి ప్రయాణం కడుతూ వుండగా కలరా తగిలి భర్త చనిపోయాడని మంగమ్మకి కబురు తెలిసింది. గోడుగోడున దుఃఖిస్తూ తన దురదృష్టాన్ని తిట్టుకుంది. ఆరునెలల పిల్లాడి అదృష్టము లేమికి విచారించింది.

అత్తారిల్లంటే మంగమ్మకి- అత్తా, మామా, ఆడుబిడ్డలూ ఎవరూ లేరు. ఇద్దరు మరదులున్నారు. వారిద్దరికీ భార్యలున్నారు. వాళ్ళలో ఎవరికీ పిల్లలు లేరు.

అన్నదమ్ములు ముగ్గురూ వుమ్మడిగానే ఉండి, పొలము పంటా చూసుకుంటూ ఉండేవారు. తమ్ముళ్ళు యిద్దరికీ అప్పుడప్పుడు ఏవైనా పోట్లాటలు వచ్చినా, పెద్దన్న సర్దివేస్తూ ఉండేవాడు. పెద్దన్న అంటే

తమ్ముళ్ళిద్దరికీ గురి అవడంచేత అతని మాటా, పెత్తనమూ సాగి పోవడమే కాక, మంగమ్మ అంటే కూడా మరదులకి కొంచెం నమ్రత వుండేది. అంచేత వాళ్ళ భార్యలు కూడా మంగమ్మ విషయంలో చాలా గౌరవాన్ని చూపిస్తూ వుండేవారు. మరదులు తమలో తాము ఏమైనా అభిప్రాయభేదాలు కలిగి ఉన్నట్లయితే, ఆమె దగ్గర చెప్పుకునే వారు. గొడవ లన్నీ మొగుడిదాకా పోనియ్యకుండా ఆమే సర్దివేసేది. మరీ అపరానంత గొడవ అయినప్పుడు, వాళ్ళిద్దరూ పైకి పోట్లాడు కోవడమూ, పెద్దన్న వాళ్ళిద్దర్నీ కొంచెం గదమాయించి, కాస్త కసురు కోవడమూ, అంతటితో ఆ కలహం సద్దు మణగడమూ జరిగేది.

భర్త చనిపోయిన తరువాత, అతని అంత్యక్రియలన్నీ జరిగిన తరువాత మంగమ్మ ఆలోచన తన బ్రతుకు మీదికి వెళ్ళింది.

తన భర్త బ్రతికి వుండబట్టి, తన మరదులూ, తోటికోడళ్ళూ తనంటే గౌరవం చూపించేవారు కాని, యిప్పుడు పూర్వపు మర్యాద తనకు జరుగుతుందా? తన పిల్లాడి ముద్దు ముచ్చటలు తీరుతాయా? వాళ్ళకి కూడా పిల్లలు పుట్టేదాకా పోకవేళ, తన కొడుక్కి కొంచెం గారాబము సాగినా, ఆ తరువాత దిక్కులేని వాణ్ణీ, తమమీద ఆధారపడ్డ వాణ్ణీ చూసినట్టు చూడరా? ఈ విధంగా మళ్ళింది మంగమ్మ ఆలోచన; కాని తనంతట తాను ఏమీ పైకి మాట్లాడ లేదు.

మంగమ్మ తండ్రి యేదో ప్రస్తావనగా, "ఆస్తి యేదో కుర్రాడి వాటా పంచుకుని అది వేరుగా వుంటే మంచిదేమో" అని మంగమ్మ మరదులతో అన్నాడు.

"అదేమిటి మామా! మాకు కాస్త ఆలోశనా, పాలోశనా చెప్పేందుకూ చేసేందుకూ పెద్దమనిషిగా యింట్లో వుంటది. పిల్లోణ్ణి మా నెత్తిన బెట్టుకుంటాం. మా ఆడోళ్ళకి, ఆమె మీద శ్రద్ధ గందా, అల్లాంటిదానికి యేర్లు పడడమేంటి?" అని పెద్ద మరది, తమ వదిన గారిని పువ్వులలోపెట్టి పూజిస్తామనే నమ్మకం యిచ్చాడు. పెద్ద మరది అలా చెపుతూ వుంటే, అతనితో విరోధం పెట్టుకోవడము యెందుకని, మంగమ్మ మాట్లాడలేదు.

అన్నట్టుగానే, మరదులిద్దరూ ఆమె మాట దాటకుండా వుండే

వారు. పెద్దన్న బ్రతికి వుండగా ఎంత భక్తీ, మర్యాదా చూపేవారో అలాగే యిప్పుడూ నడుచుకుంటున్నారు.

మంగమ్మ కాపరానికి వచ్చేటప్పటికి మరదులు గోచీపెట్టుకుని ఆడుకునే వయస్సు వాళ్లు; వాళ్ళ పెళ్ళిళ్ళూ పేరంటాలూ తన చేతి మీదుగా చేసింది. తనకు మటుకు అలస్యంగా కాన్పు వచ్చింది గాని లేకపోతే, యీ పాటికి అయిదారుగురు బిడ్డల్ని కనివుండేది. అంచేత మంగమ్మ, వాళ్ళకి వదినగారిలా కాక, తల్లిలాగే ఉంది. మంగమ్మ వయస్సు దాదాపు ముప్ఫయియేళ్లు. ఆమె పెద్ద మరిది సుమారు ఇరవై మూడు, యిరవై నాలుగు ఏళ్ళవాడు. వయస్సు చేతకూడా ఆమె ఇంటికి పెద్ద; కాపరానికి వచ్చినప్పటినుంచీ పెద్ద మనిషి అనీ, ఉత్తమురాలనీ, పేరు పొందింది.

ఆ బజారులో ఉన్న ఆడవాళ్ళందరిలోకీ మంగమ్మే అందకత్తె. ఆమె కాపురానికి వచ్చిన కొత్తలో, చాలా రోజులదాకా, ఆ బజారులో పోకిరీవాళ్లు తిరుగుతూ వుండేవారు కాని, ఆమె అలాంటిది కాదనీ; తమకు లోబడదనీ తెలుసుకుని, అటు రావడము మానివేశారు. ప్రతి యింటి కోడలి మీదా ఏదో ఒకటి చెప్పుకునే ఆ వూరి అమ్మలక్కలికి మంగమ్మని గురించి చెప్పుకుందుకు ఏమీ కనబడలేదు.

ఇన్ని విధాల యింట్లోనూ, వూళ్లోనూ గూడా ఆమె ఘరానా మనిషే అనిపించుకుంది. వూళ్ళోవాళ్లు చూపించే మర్యాదకి యింట్లో వాళ్లు ఆమె మీద గౌరవ భావాన్ని ఎక్కువ చేసుకున్నారు.

భర్త పోయినా మరదులతోనే ఆమె ఒకే యింట్లో వుంటూ ఉన్నందుకు ఆ వూరివాళ్లు ఆమెను మెచ్చుకున్నారే కాని, అపవాదులు ఏమీ వెయ్యలేదు.

మంగమ్మకి కూడా ఏమీ యిబ్బంది లేకుండానే ఉంది. నాలుగు నెలలు గడిచిపోయాయి.

మరదు లిద్దరూ పొలం వెళ్లారు చిన్న తోటికోడలు పొలం వెళ్ళిన మగవాళ్ళకి అన్నం తీసుకువెళ్ళింది. పెద్ద తోటికోడలు, ఊరి బయట ఉన్న చొప్పదొడ్లో వేసిన సొరతీగ నుంచి కాయ కోసుకు రావ డానికి వెళ్ళింది. సాయంత్రం మూడు గంటలు అయింది. కొడుకు

నిద్దర పోతున్నాడు. మంగమ్మ పెరట్లో ఉన్న దానిమ్మ చెట్టునవున్న కాయలు పక్షులు కొట్టి వెయ్యకుండా గుడ్డలు కడుతోంది.

ప్రక్కయింటి మిద్దెమీదనుంచి యీలపాట వినపడి అటు చూసింది. ఆ యింట్లో అద్దెకి వున్న పోలీసు కాన్స్టబిలు వీరయ్య అప్పుడే బీటునుంచి వచ్చి, ఏ ఊళ్ళో నించో తెచ్చుకున్న పండు మిరప కాయలు మిద్దెమీద ఆరబోస్తూ ఈమెను చూసినట్టున్నాడు, ఈల వెయ్యడం ఆరంభించాడు.

ఆమె అటు చూడగానే. చిరునవ్వు నవ్వాడు. ఆమె తలవంచు కొని తన పని చేసుకుంటోంది. తన కేసి చూసి యిదివరకు యెవరూ చిరునవ్వు నవ్వలేదు, అంచేత ఆమె ఆలోచిస్తోంది యిదేమిటా అని; అందులోనూ పోలీసులంటే, వాళ్ళందరికీ అదోమాదిరి భావము. వాళ్ల సర్కారు అధికారులనే గౌరవ భావమూ, వాళ్ళతో విరోధం పాముతో చెలగాటం లాటిదనే భయమూ, దయాదాక్షిణ్యం లేకుండా వాళ్ళు ఇతర్లని బాధిస్తారనే కోపమూ.

మంగమ్మ తల వంచుకొనే ఉంది. "మీ మరదులు యింట్లో లేరూ?" అన్నాడు వీరయ్య. మంగమ్మ తలయెత్తి చూసింది. అతడు మిద్దెమీద నుంచి మదురు గోడ మీదికి దిగి వచ్చాడు.

ఏం చెప్పాలో ఏమిటో ఆమెకి తెలియదు.

"పొలం బోయి రాలే" అని నిజం చెప్పింది. అతని మొహాన చిరునవ్వు మళ్ళీ కనపడింది. "తోటికోడళ్లు కూడ అళ్ళ యెంట బోయి నారా?" అన్నాడు అతడు.

"ఒకామె అన్న మెత్తుకొని పోయింది" అని మంగమ్మ నిజమే చెప్పింది.

"రెండో ఆమె యింట్లో ఉందా?" అన్నాడు.

ఏ కారణం చేతనేనా అబద్ధం చెప్పవలసి వస్తుందని కాని, అత నికి ఆ సమయంలో అబద్ధం చెప్పాలని కాని, ఆమె అనుకోలేదు. అతడువేసే ప్రశ్నలకు కారణ మేమిటో ఆమె ఆలోచించలేదు. అతడు అడుగుతున్నాడు. ఆమె చెపుతోంది. అంతే. "లేదు; చొప్ప దొడ్డికి పోయింది" అని అతనికి ఆఖరి సమాధానం చెప్పివేసింది.

"లోపలికి దిగేదా?" అన్నాడు వీరయ్య.

ఎందుకూ.... ....ఆమెకి అర్థమయింది, ఇప్పటికి అర్థమయింది అతని మనోభావం.

కాని, అతనికి సమాధానం ఏమని చెప్పాలి?

"ఎందుకూ?" అన్నది.

"ఇంట్లో ఎవరూ లేరుగా—" అతడు నిలివెడున్నర గోడా దూకి లోపల పడ్డాడు. ఆమె గాభరా పడ్డది.

"ఏమిటది? ఎందుకు? ఎందుకు?" అని గబగబా అడిగింది. ఏం చెయ్యాలో ఆమెకి తోచలేదు.

"నీ కోసమే. ఇంట్లో ఎవరూ లేరు—నిన్ను చూసినాలనుంచి, నాకుమనసు కుదటపడితే వొట్టు" అంటూ ఆమె దగ్గరికి చేరి, ఆమెను దగ్గరగా లాక్కున్నాడు. ఆమెకి ఇష్టమూలేదు, అయిష్టమూలేదు. 'ఇంట్లోఎవరూ లేరుగా' అని అతడు పదే పదే అనడం ఆమెను తిరుగు బాటు చెయ్యకుండా చేసింది. అతని కోర్కెకి ఆమె అడ్డలేదు........

"మళ్ళీ ఎప్పుడు?" అని అడిగాడు ఆమెను.

"నీ యిష్టం" అంది మంగమ్మ.

"రేపు మాపటికి, పది గంటలయేళ, ఇక్కడికే రా" అని అమెకు చెప్పి, అలాగే ననిపించుకొని, గోడ మూలన ఉన్న నిచ్చెన వేసుకుని గోడయెక్కి, మిద్దెమీదికి పోయినాడు వీరయ్య.

సంవత్సరంన్నర పైగా అయింది, మంగమ్మ మగవాడితో సుఖం యెరిగి. కొన్నాళ్ళు మరిచిపోయింది. జ్ఞాపకం వచ్చిన తరువాత, ఇక లాభం లేదనుకుంది. తన తోటికోడళ్ళు ఊళ్లో వున్న కొంతమంది వ్యభిచారిణులనుగురించి యేదేనా చెపుతూ ఉంటే వాళ్ళకి ఎలా సాగు తుందా అనుకునేది.

కాని ఇవ్వాళతో ఆ ఆలోచనలన్నీ తీరిపోయాయి. శరీరమంతా ఒక్కసారి మత్తు వదలించుకున్నది.

రేపు రాత్రి ఎప్పు డవుతుందా అనే ఒక్క ఆలోచన తప్ప మనసులో యింకేమీ లేదు. ఇంట్లో ఎవరూ లేరు కనుకనూ, ఎవరూ

చూడరు కనుకనూ, ఈ వ్యవహారం బయటివాళ్లకి యెవరికి తెలియదు —అంచేత భయం ఏమీ లేదు.

మరునాటి రాత్రి, అందరూ అన్నాలు తిని పడుకున్న తరవాత, అనుకున్న వేళకి అక్కడికి వెళ్ళి అతన్ని కలుసుకున్నది. మళ్ళీ మర్నాడు; ఆ మర్నాడు.

వీరయ్య డ్యూటీమీద ఏదో ఊరు వెళ్ళాడు. ఆమె పడ్డ బాధ అంతా యింతా కాదు. 'మీ ఆయన ఊళ్ళో లేడా!' అనీ, 'శానా రోజులయినట్టుందే' అనీ వీరయ్య భార్యని యేవో ప్రశ్నలు అడిగి, ఆమె ద్వారా అతను ఎప్పుడు వస్తాడో తెలుసుకుందామని ప్రయత్నించింది. కాని, భర్త ఎప్పుడు వస్తాడో వీరయ్య భార్యకి మాత్రం ఏం తెలుసు! ఫలానప్పుడు వొస్తాడని తెలియక పోవడంవల్ల మంగమ్మకి అతని రాకకోసం ఆత్రం యెక్కువ అయింది.

ఆ వారం రోజులూ ఆమె పడ్డ బాధకి అంతులేదు. అతడు వచ్చాడు. ఆ రోజు సాయంత్రం తొందరగా అవదేమో అనిపించింది ఆమెకు. సాయంత్రం అయింది. చీకటి పడింది. పూర్తిగా రాత్రి అయింది. భోజనాలు అయాయి. మరదులూ, తోటికోడళ్ళూ ఎవరి గదులలోకి వాళ్ళు చేరుకున్నారు.

ఈపాటికి దానిమ్మ చెట్టు దగ్గరికి వీరయ్య వచ్చి ఉంటాడు. ఆమె లేవబోయింది. కొడుకు ఏడుపు ఆరంభించాడు. జోకొట్టింది. వాడు మానలేదు. కొంచెంసేపు పాలిచ్చి మళ్లీ పడుకోబెట్టబోయింది. వాడు పడుకోలేదు. గట్టిగా ఏడుస్తున్నాడు.

పాపం, వీరయ్య పెరట్లో కనిపెట్టుకొని వుంటాడేమో!

కొడుకుమీద కోపం వచ్చింది. ఛెళ్లున నాలుగైదు దెబ్బలు వేసింది. వాడి ఏడుపు మరీ యెక్కువైంది. 'కొట్టబోకు అప్పయ్యా, కొంచెం జోల పాడమ్మా" అని ప్రక్కనే గదిలో భర్తతో పడుకున్న చిన్న తోటికోడలు కేక వేసింది.

మంగమ్మకి కోపమూ, రోషమూ పెనవేసుకుపోయాయి. వీరయ్య ఇంకా పెరట్లో అలా నిలుచోవలసినదేనా?

పిల్లాడు ఏడుపు మానడే—

రెండు చేతులతోటీ శక్తికొద్దీ వాడి గొంతుక పిసికేసింది. నిమిషంలో పిల్లాడు ఏడ్పు మానేశాడు. సద్దుకాకుండా పెరట్లోకి వెళ్ళి వీరయ్యని కలుసుకొంది.

మళ్లీ వచ్చిన తరువాత, పిల్లాడి మీద చెయ్యివేసి చూస్తే, ఊపిరి లేదు.

కెవ్వున కేకవేసి, గొల్లుమంది.

---

# 16. సెలవు

సెలవు కోసం వ్రాస్తే, దొరదగ్గిర్నుంచి ఇంకా ఉత్తరువు రాలేదు. భార్యకి చలిజ్వరం. రెండు సంవత్సరాల కూతురికి కడుపులో బల్ల. తనకి వండి పెట్టే దిక్కులేదు ఆ ఊళ్ళో డాక్టరు లేడు. డాక్టరు కోసం ఒక కాన్‌స్టబిల్ని పంపించినా యింకా ఎవరూ రాలేదు. అతీగతీ తోచక వాకిట్లో కుర్చీలో కూచున్నాడు సబిన్‌స్పెక్టరు శ్రీనివాసరావు. ఎదురుగా హెడ్‌కాన్‌స్టబిల్ నిలుచున్నాడు.

శ్రీనివాసరావు బ్రాహ్మణుడు. ఆ ఊళ్లో గ్రామకరణం ఇల్లు తప్ప వేరే బ్రాహ్మణ కొంప లేదు. రెండు నెలలనాడు గ్రామకరణానికీ మునసబుకీ తగాదా వచ్చి, రెండు పార్టీలవారూ కొట్టుకున్నారు. ఆ కేసులో న్యాయం ఎటుపైపున ఉన్నా శ్రీనివాసరావు మునసబు పక్షంలో పనిచేశాడు. కరణం నాలుగువందలు ఆశ చూపినా శ్రీనివాసరావు చెయ్యి చాపలేదు. తను ఇవ్వబోయిన నాలుగువందలు తీసుకోకపోవడంవల్ల "మునసబు దగ్గిర ఏడెనిమిది వందలు కాజేసి వుంటాడు" అని కరణం అన్నాడు. మునసబు మటుకు తన పార్టీ పెద్దలదగ్గిర "దమ్మిడీ ఇవ్వలేదు నేను. మన పార్టీవాళ్ళకి దెబ్బలు ఉరువుగా తగిలాయి. కరణం పార్టీవాళ్ళు తప్పించుకున్నారు. అంచేత ఆ పార్టీవాళ్ళలో